మహిళలకు కేటాయించిన స్థానాలు, శాతం

	సర్పంచ్‌లు	వార్డులు
మొత్తం	594	5,058
మహిళలు	278	2,436
శాతం	46.80	48.16
జనరల్	316	2,622
శాతం	53.19	51.83

పకడ్బందీగా పంచాయతీ ఎన్నికలు

అధికారులు పూర్తి బాధ్యతతో పని చేయాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, పక్కన ఎస్పీ స్నేహ మెహ్రా

వికారాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో పంచాయతీ ఎన్నికలను అధికారుల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహిస్తామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నిల కమిషనర్ రాణి కుముదిని, అదనపు డీజీపీ మహేశ్ భగవత్, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో ఎనిమిది మండలాల్లోని 262 సర్పంచ్, 2,198 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్, వీడియో సర్వేలైన్ బృందాలు, ఎంసీఎంసీ, వీడియో సెల్, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎన్నికలకు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ హర్ష్‌చౌదరి, అడిషనల్ ఎస్పీ రాములునాయక్, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ తదితరులు పాల్గొన్నారు.

కచ్చితంగా నియమావళి పాటించాలి

జిల్లాలో పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడానికి అధికారులు పూర్తి బాధ్యతతో, అన్ని నియమాలను కచ్చితంగా పాటిస్తూ పనిచేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు మోడల్ కోడ్ కండక్ట్, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, సర్వేలైన్ టీమ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాటితో సంబంధించి స్థానిక పోలీస్ సిబ్బంది సమన్వయం చేసుకోవాలని సూచించారు. పౌరులు తమ సందేహాలు తెలిపేందుకు 24/7 హెల్ప్‌లైన్ నంబర్ 8416235291 అందుబాటులో ఉంటుందన్నారు. అలాగే కలెక్టరేట్‌లో 08416-23591 నంబర్ ద్వారా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయబడిందని తెలిపారు. ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ ఎన్నిల నియమావళిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అక్రమంగా డబ్బు, మద్యం సరఫరా, ప్రలోభాలు, బహుమతుల పంపిణీ నియంత్రణలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు.

కిరోసిన్ ఒంటిపై పోసుకొని కార్మికుడి హల్‌చల్

నైట్ డ్యూటీ నుంచి విముక్తి కల్పించాలని విన్నపం

6

నారీ.. సారీ!



పంచాయతీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ మహిళలకు సగభాగం రిజర్వేషన్లు కల్పించాల్సి ఉన్నా కేటాయింపుల్లో అది జరగలేదు. దీంతో సర్పంచ్‌ల సంఖ్య పెరిగినప్పటికీ గత ఎన్నికల కంటే ఈసారి మహిళలకు తక్కువ స్థానాలు ఖరారయ్యాయి. దీంతో ఈ సారి గ్రామ పరిపాలనలో అతివలకు అంతంత మాత్రంగానే ప్రాతినిధ్యం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 594 సర్పంచ్ స్థానాల్లో జనరల్‌కు 316 స్థానాలు రిజర్వ్ చేయగా.. మహిళలకు కేవలం 278 స్థానాలు(46.80శాతం) కేటాయించారు. కాగా, గత ఎన్నికల్లో మహిళలకు 49.91 శాతం స్థానాలు రిజర్వ్ చేయడం గమనార్హం.

పంచాయతీ ఎన్నికల్లో మహిళలకు దక్కని సమన్యాయం

సర్పంచ్ స్థానాలు 46.80 శాతంతోనే సరి

పంచాయతీలు పెరిగినా గతంకంటే తగ్గిన స్థానాలు

జనరల్ స్థానాల్లో అవకాశం అంతంత మాత్రమే

వికారాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత పంచాయతీ ఎన్నికల్లో జనరల్ స్థానాల కంటే మహిళలే ఎక్కువగా ప్రాతినిధ్యం వహించగా, ఈసారి మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. సర్పంచ్ పదవులతో పాటు వార్డు స్థానాల కేటాయింపుల్లోనూ ఇదే పరిస్థితి. జిల్లాలో మొత్తం 594 పంచాయతీలు ఉండగా, వాటిలో 278 స్థానాలను మహిళలకు రిజర్వు చేశారు. గత ఎన్నికల్లో మహిళలకు 282 సర్పంచ్ పదవులను రిజర్వు చేశారు. అలాగే గతంలో జిల్లాలో 565 పంచాయతీలు ఉండగా, ఈసారి 594 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. పెరిగిన పంచాయతీల సంఖ్యకు అనుగుణంగా మహిళలకు సర్పంచ్ స్థానాలు రిజర్వు కావాల్సి ఉండగా, ఈసారి తగ్గడం గమనార్హం. గత పంచాయతీ ఎన్నికల్లో మహిళలకు 49.91 శాతం రిజర్వేషన్లు అమలు కాగా, ఈసారి 46.80 శాతం మాత్రమే రిజర్వేషన్లు ఖరారు చేశారు. అలాగే మొత్తం వార్డులు 5,058 ఉండగా, వాటిలో 2,436 వార్డులను మహిళలకు రిజర్వు చేశారు. గత ఎన్నికల్లో కంటే ఈసారి మహిళలకు 9 వార్డులు ఎక్కువ రిజర్వు అయ్యాయి. గత ఎన్నికల్లో వార్డు సభ్యుల పదవుల్లో మహిళలకు 50.22 శాతం కేటాయించగా, ఈసారి

మిగతా 8వ పేజీలో...

వార్డు పదవుల్లోనూ అదేతీరు...!

పంచాయతీ వార్డు సభ్యుల పదవుల్లోనూ మహిళలకు ఈసారి సమన్యాయం జరగలేదు. మొత్తం 5,058 వార్డు సభ్యుల పదవుల్లో కేవలం 2,436 పదవులు మాత్రమే మహిళలకు కేటాయించారు. బంట్వారం మండలంలో 106 వార్డులు ఉండగా, వాటిలో మహిళలకు 53 వార్డులు కేటాయించారు. బషీరాబాద్ మండలంలో 312 వార్డులు ఉండగా, వాటిలో 138 మహిళలకు రిజర్వు చేశారు. బొంరాస్‌పేట్ మండలంలో 292 వార్డుల్లో 146 వార్డులు, చౌడాపూర్ మండలంలో 202 వార్డుల్లో 101 వార్డులు, ధారూరు మండలంలో 286 వార్డుల్లో 135 వార్డులను మహిళలకు రిజర్వు చేశారు. దోమ మండలంలో 308 వార్డులు ఉండగా, వాటిలో 153 వార్డులు, దౌల్తాబాద్ మండలంలో 290 వార్డుల్లో 133 వార్డులు, దుద్యాల మండలంలో 166 వార్డుల్లో 83 వార్డులు మహిళలకు కేటాయించారు. కొడంగల్ మండలంలో 222 వార్డుల్లో 111 వార్డులు, కోట్‌పల్లి మండలంలో 150 వార్డుల్లో 75 వార్డులు, కులకచర్ల మండలంలో 280 వార్డుల్లో 140 వార్డులు మహిళలకు రిజర్వు చేశారు. మర్పల్లి మండలంలో 264 వార్డుల్లో 132 వార్డులు, మోమిన్‌పేట్ మండలంలో 256 వార్డుల్లో 114 వార్డులు, నవాబ్‌పేట్ మండలంలో 276 వార్డుల్లో 140 వార్డులు, పరిగి మండలంలో 268 వార్డుల్లో 134 వార్డులు మహిళలకు కేటాయించారు. పెద్దేముల్ మండలంలో 308 వార్డుల్లో 143 వార్డులు, పూడూరు మండలంలో 282 వార్డుల్లో 122 వార్డులు, తాండూరు మండలంలో 290 వార్డుల్లో 135 వార్డులు, వికారాబాద్ మండలంలో 182 వార్డుల్లో 91 వార్డులు, యాలాల్ మండలంలో 318 వార్డుల్లో 159 వార్డులు మహిళలకు రిజర్వు చేశారు. కొన్ని మండలాల్లో సగభాగం మహిళలకు కేటాయించినా మిగిలిన మండలాల్లో మహిళలకు 50 శాతం కంటే తక్కువ వార్డు స్థానాలు దక్కాయి.


సంగ్రామం షురూ..

వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రదర్శన

నేటి నుంచి నామినేషన్ల దాఖలు.. ఏర్పాట్లు పూర్తి

తొలుత తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో ఎన్నికలు

నేడే తొలి విడత నోటిఫికేషన్ జారీ



వికారాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీ ఎన్నికలకు నేడు సమర శంఖం పూరించనున్నారు. తొలి విడత ఎన్నికలు నిర్వహించేందుకు రిటర్నింగ్ అధికారులు గురువారం ఉదయం నోటీసులు జారీ చేయనున్నారు. జిల్లాలో మొత్తం 594 పంచాయతీలు ఉండగా, వాటిలో మొదటి విడతలో 262 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. నోటిఫికేషన్ జారీ చేసిన వెంటనే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. గురువారం నుంచి శనివారం వరకు రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల పరిశీలన ప్రక్రియ కొనసాగనుంది. ఆ తర్వాత అర్హత కలిగిన నామినేషన్ల వివరాలను ప్రకటిస్తారు. కాగా, నామినేషన్లపై వచ్చిన అభ్యంతరాలను డిసెంబరు ఒకటో తేదీన ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారు. 2వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాలను పరిష్కరించనున్నారు. 3వ తేదీ, మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉప సంహరణకు గడువు విధించారు. ఆ తరువాత

మిగతా 8వ పేజీలో...

తొలి విడత ఓటర్లు

మొత్తం	పురుషులు	మహిళలు	ఇతరులు
2,93,552	1,42,307	1,51,237	08

తొలి విడత:

- నోటిఫికేషన్ : నేడే(నవంబరు 27)
- నామినేషన్లు : 27 నుంచి 29వ తేదీ వరకు
- పరిశీలన, జాబితా : నవంబరు 30
- ఉప సంహరణ : డిసెంబరు 3
- అభ్యర్థుల తుది జాబితా : డిసెంబరు 3
- పోలింగ్ : డిసెంబరు 11



రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు చైతన్య

మేడ్చల్ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు మేడ్చల్‌కు చెందిన యూనివర్సల్ 369 మార్షల్ ఆర్ట్ అకాడమీ విద్యార్థి పి.చైతన్య ఎంపికయ్యాడు. మూడు రోజులుగా వికారాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల ఎంపికలో అండర్-14 చాంపియన్‌షిప్ పోటీల్లో చైతన్య ప్రతిభ చూపి బంగారు పతకం సాధించాడు. అతడిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇండోర్‌లో నిర్వహించే పోటీల్లో చైతన్య రాష్ట్రం తరఫున పాల్గొంటాడని అకాడమీ నిర్వాహకులు తెలిపారు.

రైల్వే సమస్యలను పరిష్కరించాలి

కేంద్ర మంత్రిని కోరిన ఎంపీ ఈటల



రైల్వేశాఖ మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ ఈటల, బీజేపీ నేత సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో నెలకొన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం మంత్రికి వినతి పత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డితో కలిసి ఢిల్లీకి వెళ్లిన ఎంపీ ఈటల రైల్వేశాఖ మంత్రిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసి ఘట్‌కేసర్ పట్టణంలోని రైల్వే సమస్యల గురించి వివరించారు. ఘట్‌కేసర్ నుంచి వివిధ జిల్లాలకు నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని వివరించారు. పరిసర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో విద్యా సంస్థలు, ఐటీ పరిశ్రమ ఉన్నాయని గుర్తు చేశారు. దీంతో నిత్యం పెద్దఎత్తున ఉద్యోగులు, జనాలు ప్రయాణాలు సాగిస్తున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ఘట్‌కేసర్ నుంచి లింగంపల్లికి ఎంఎంటీఎస్ అదనపు ట్రిప్పులను పెంచడంతో పాటు సికింద్రాబాద్‌కు సైతం ఎంఎంటీఎస్ సర్వీసులను నడపాలని కోరారు. ఎన్ఎఫ్‌సీ నగర్ వద్ద రైల్వే ఫ్లైఓవర్ నిర్మించాలని విన్నవించారు. నిత్యం రద్దీగా ఉండే ఘట్‌కేసర్‌లోని కొండాపూర్ రైల్వే వంతెన వద్ద పట్టాలను దాటేందుకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. అలాగే రిసాలబజార్, కొకూరు, తూంకుంట, కొంపల్లి, యాప్రాల్, దూలపల్లి, తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు అనువుగా ఉండేందుకు ఘట్‌కేసర్‌లో రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను ఆపేందుకు చర్యలు చేపటాల్టని రైల్వే మంత్రిని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

» వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా



వికారాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన కఠినమైన చర్యలు తప్పవని ఎస్పీ స్నేహ మెహ్రా పేర్కొన్నారు. జిల్లాలో టాస్క్‌ఫోర్స్ నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు జిల్లా వ్యాప్తంగా అక్రమ రవాణాదారులపై ఉక్కుపాదం మోపుతున్నాయన్నారు. అనుమతులు లేకుండా సహజ వనరులను తరలిస్తున్న వారిపై నిఘా ఉంచి వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. గత నాలుగు రోజులలో జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు 6 ఇసుక ట్రాక్టర్లు, 3 ఎర్రమట్టి టిప్పర్లను ఒక జేసీబీతో కలిపి మొత్తం 10 వాహనాలను సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అక్రమ రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లడమే కాకుండా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని తెలిపారు. ఎవరైనా ఎక్కడైనా అక్రమ తరలింపులు చేసినట్లు గుర్తిస్తే జిల్లా ప్రజలు వెంటనే జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

రాజ్యాంగాన్ని ప్రతీ ఒక్కరు గౌరవించాలి

» అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



ప్రతిజ్ఞ చేస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్వో హరిప్రియ

మేడ్చల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాజ్యాంగాన్ని ప్రతీ భారతీయుడు గౌరవించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డీఆర్వో హరిప్రియ, వివిధ శాఖల అధికారులతో కలిసి రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. 'భారత ప్రజలమైనసమేము, భారతదేశాన్ని సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాంగా నిర్మించుకోవడానికి, పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, ఆలోచన, భావప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనలల స్వాతంత్ర్యాన్ని స్థితిగతుల్లోనూ, అవకాశాల్లోనూ సమానత్వాన్ని చేకూర్చడానికి కృషి చేస్తామని' ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మన రాజ్యాంగం 1949 నవంబరు 26న రాజ్యాంగ పరిషత్‌లో తీర్మానం అనంతరం శాసనంగా రూపొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో అయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు

వికారాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రేపు(28వ తేదీన) జిల్లా స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంధులకు, బధిరులకు రన్నింగ్, షాట్‌ఫుట్, చెస్, జావిలెన్ త్రో, క్యారమ్, జావలిన్, బుద్ధి మాంద్యం ఉన్న వారికి రన్నింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వికారాబాద్‌లోని బ్లాక్ గ్రౌండ్ స్టేడియంలో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన దివ్యాంగులు వారి సదరం, ఆధార్ కార్డుతో ఉదయం 9 గంటల వరకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8179432874, 9000778300 నంబర్లను సంప్రదించాలన్నారు.



బిల్లుల వివరాలు తెలుసుకుంటున్న డీసీవో వెంకట్‌రెడ్డి, డీఎస్‌వో శ్రీనివాస్‌రెడ్డి

ధాన్యం బిల్లులు చెల్లిస్తాం

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరించిన రైతులందరికీ వెంటనే బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని, ఈ విషయంలో ఆందోళన చెందొద్దని డీసీవో వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'వడ్ల పైసల్ వొస్తలేవ్' అనే కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కో-ఆపరేటివ్ అధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా సివిల్ సప్లయాస్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఎదులాబాద్ రైతువేదికలో ధాన్య రైతుల బిల్లుల ట్యాబ్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ రోజు కొందరు రైతుల ఖాతాల్లో డబ్బు జమచేసినట్లు తెలిపారు. గురువారం నుంచి అందరికీ డబ్బులు జమ చేస్తామని తెలిపారు. రైతులు అధైర్యపడొద్దని, వడ్లు అమ్మిన ప్రతీ ఒక్కరికి డబ్బు జమచేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధికారులు, వ్యవసాయ అధికారులు లావణ్య, జగదీష్, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సబితా ఇంద్రారెడ్డి

'దీక్షా దివస్'ను విజయవంతం చేయాలి

శంషాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఈనెల 29న నిర్వహించే బీఆర్ఎస్ దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం సాయంత్రం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. కేసీఆర్ దీక్ష వల్లనే తెలంగాణ వచ్చిందని గుర్తుచేశారు. ఏ పార్టీ నేతలను సంప్రదించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేసిందన్నారు. ఆ ప్రభుత్వానికి ఎక్కడ కూడా అప్పులు దొరకడం లేదన్నారు. రంగారెడ్డి జిల్లా ఫర్ సేల్ అనే నినాదంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఫ్యూచర్‌సిటీ అని చెప్తున్నా.. అక్కడ ఏమీలేదని, కోకాపేట్‌లోని భూములను కూడా రేవంత్ సర్కార్ ఎప్పుడో అమ్మేసిందన్నారు. అభివృద్ధిలో ముందున్న రంగారెడ్డి జిల్లాను గ్రేటర్‌లో విలీనం చేశాక.. ప్రభుత్వం తాకట్టు పెట్టి అప్పుతేవడానికి విశ్వప్రయత్నం చేస్తుందన్నారు. బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మోహన్‌రావు, జిల్లా, మండల స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక సేవతోనే గుర్తింపు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాలతో వాసవి క్లబ్‌లను ప్రత్యేక గుర్తింపు లభిస్తున్నదని క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ అన్నారు. షాద్‌నగర్ వాసవి, వనితా క్లబ్ చేసిన పలు అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించి అభినందించారు. దాతల సహకారంతో షాబాద్ మండలం కుర్వగూడ, సర్దార్‌నగర్‌లలో నిర్మించిన బస్సు షెల్టర్‌ను పరిశీలించారు. అనంతరం దాత ఎల్కుర్తి నారాయణ ఆయన కుమారుడు ఎల్కుర్తి శ్రీనివాసులు షాద్‌నగర్ విష్ణు సహస్రనామ పారాయణ కమిటీ భవనం కోసం ఇచ్చిన 215 గజాల స్థల రిజిస్ట్రేషన్ పత్రాలను పారాయణ కమిటీ అధ్యక్షుడు స్వరాజ్‌బాబుకు అందజేశారు. విష్ణు సహస్రనామ పారాయణ కమిటీ భవన నిర్మాణం కోసం డాక్టర్ గుడిపాటి సురేష్, నిర్మల దంపతులు రూ.లక్షా 11 వేల విరాళం ఇచ్చారు. పారాయణ భవనం మొదటి దశ నిర్మాణంలో 20శాతం నిధులను వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ నుంచి కేటాయిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఆనంతం, కార్యదర్శి సంతోష్, ఇంటర్నేషనల్ వైస్ ప్రసిడెంట్ దొంతు పాండురంగయ్య, సురిశెట్టి నర్సింహ్మగుప్త, ఎలుకుర్తి శ్రీనివాస్, కల్వ మాణిక్యం, కల్వ మధుప్రియ, గుడిపల్లి వెంకటరమణ, కొండ రమ, విజయలక్ష్మీ, జి. సురేష్, స్వప్నకుమార్, కె. నవీన్‌కుమార్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



ప్లాటు రిజిస్ట్రేషన్ పత్రాలను ఇస్తున్న ఇరుకుల రామకృష్ణ

కిరోసిన్ పోసుకుని కార్మికుడి హల్‌చల్

- నైట్ డ్యూటీ నుంచి విముక్తి కల్పించాలని విన్నపం
- అధికారి ఒప్పుకోవడం లేదని ఆత్మహత్యాయత్నం
- ఆసుపత్రికి తరలించిన సిబ్బంది

వికారాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తాను నైట్ డ్యూటీ చేయనని ఓ కార్మికుడు కిరోసిన్ పోసుకుని హల్‌చల్ చేసిన ఘటన వికారాబాద్ మునిసిపాలిటీలో చోటుచేసుకుంది. వికారాబాద్‌కు చెందిన సత్తయ్య మునిసిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నాలుగేళ్లుగా నైట్ వాచ్‌మన్‌గా ఉంటున్నాడు. బుధవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాస్‌ను కలిసి తాను నైట్ డ్యూటీ చేయనని, తన భార్య ఆరోగ్యం బాగలేదని విన్నవించాడు. మరి ఎక్కడ పనిచేస్తావో పేర్కొంటూ పేపర్‌పై రాసివ్వాలని ఏసుదాసు తెలుపడం సత్తయ్య దురుసుగా మాట్లాడుతూ కిరోసిన్ పోసుకున్నాడు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది అతడిని అడ్డుకొని తోసేసి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కమిషనర్ జకీర్‌అహ్మద్ వివరణిస్తూ.. అధికారులు, సిబ్బంది మధ్య ఏమైనా విభేదాలు ఉంటే తన దృష్టికి తేవాలని సూచించారు. ఈ విషయంలో విభాగ సభ్యులతో మాట్లాడానని, సత్తయ్య ఆవేశంతో అలా చేశాడని అన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎడ్యుకేటర్ సురేష్

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక, వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మేనేజ్‌మెంట్ ఎడ్యుకేటర్ ప్రొఫెసర్ సురేష్ తెలిపారు. వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో బుధవారం కేస్ మెథడ్ ఆఫ్ టీచింగ్ ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అంశంపై ఇన్-హౌస్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ ప్రోగ్రాంలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

షాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని రాజేంద్రనగర్ డీసీపీ యోగేశ్‌గౌతమ్ అన్నారు. సీపీ ఆదేశాల మేరకు బుధవారం షాబాద్ మండలంలో 7 టీంలుగా ఏర్పడి నాఖాబందీ నిర్వహించారు. ముగ్గురు ఏసీపీలు, 9 మంది సీఐలు, 18 మంది ఎస్ఐలు, 100 మంది పోలీసులతో 7 బృందాలుగా ఏర్పడి 472 వెహికిల్స్ చెకింగ్ చేయగా.. 26 నెంబర్‌ప్లేట్స్ లేనివి, పత్రాలు లేనివి, 6 లైసెన్స్ లేనివి సీజ్ చేశారు. అనుమతి లేని రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నిల దృష్ట్యా చెకిపోస్టులు పెట్టామని, ఒక వ్యక్తి రూ.50 వేలకంటే ఎక్కువ తీసుకెళ్లద్దని డీసీపీ సూచించారు. ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. యువత డ్రగ్స్ గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అడిషనల్ డీసీపీ కళింగరావు, ఏసీపీలు శ్రీనివాస్, కిషన్, రమణగౌడ్, షాబాద్ సీఐ కాంతారెడ్డి, ఎస్ఐ రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ యోగేశ్ గౌతమ్


ఎంపీ రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

టీచర్లకు 'టెట్' మినహాయింపు ఇవ్వాలి

మేడ్చల్ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చేలా చూడాలని మేడ్చల్ జిల్లా టీపీయూఎస్ నాయకులు బుధవారం మాల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి పత్రం ఇచ్చారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మునీరాబాద్‌లో ఈటల నివాసంలో ఆయనను కలిశారు. లోక్‌సభ శీతాకాల సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తి ప్రభుత్వ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తేవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నవీన్, శ్రీధర్, గోపాల్, సురేందర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్రాథమిక హక్కులపై అవగాహన కల్పించాలి


ప్రమాణం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

యాలాల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక హక్కులపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య అన్నారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని యాలాల మండల కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ పీఠికను చదివించి ప్రమాణం చేశారు. దేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రను విద్యార్థి దశ నుంచే నేర్పాలని, కేరళ తరహా పాఠ్యాంశాలను రూపకల్పన చేసి బోధించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, నరేందర్, బాలప్ప పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన


పూజల్లో భక్తులు.. గోపూజ నిర్వహిస్తున్న భక్తులు

తాండూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతారంలో ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యాయి. బుధవారం ఆలయంలో హోమం, గోమాత, గణపతి పూజలు, దేవతామూర్తుల ఊరేగింపు, మహిళలు జలాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

ట్రెసా జిల్లా అధ్యక్షుడికి సన్మానం


ఎంపీ రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

పరిగి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలంగా రెవెన్యూ ఉద్యోగుల సంఘం (ట్రెసా) జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన జి.విజయేందర్‌ను బుధవారం పరిగి తహసీల్దార్ కార్యాలయంలో ఆయా సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. విజయేందర్ ఉద్యోగ పరంగా, సంఘ పరంగా అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీటీ అనిల్, ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, రత్నయ్య, ప్రేమ్, రమేశ్, రాంచందర్, భరత్, అశోక్ పాల్గొన్నారు.


పర్సాపూర్‌లో సైడ్ డ్రైనేజీపైకి దుసుకెళ్లిన టిప్పర్

రోడ్డు పనులను వేగవంతం చేయాలి

కొడంగల్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పర్సాపూర్ గుండా వెళ్తున్న 163 నేషనల్ హైవే విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. పనులు నత్తనడకన కొనసాగడంతో గ్రామస్తులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులను వేగవంతం చేయాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే బుధవారం కంకర్ లోడ్ టిప్పర్ అదుపుతప్పి రోడు పక్కన కడుతున్న డ్రైనేజీలోకి దుసుకెళ్లింది.

అండర్-17 చాంపియన్‌గా 'పరిగి'


విజేతగా నిలిచిన జట్టు

పరిగి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 క్రికెట్ పోటీల్లో పరిగి జట్టు విజేతగా నిలిచింది. పరిగి స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో పరిగి, వికారాబాద్, తాండూరు, పెద్దేముల్, మోమిన్‌పేట్ జోన్‌లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో పరిగి-వికారాబాద్ తలపడ్డాయి. పరిగి జట్టు గెల్చింది. పరిగి జట్టును షీల్డ్, మెమొంటోలను అందజేశారు.


నిరసన తెలుపుతున్న సాకేత్ ప్రణామం నివాసితులు

రోడ్డును ప్లాటుగా మార్చితే సహించం

మేడ్చల్ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు స్థలాన్ని బిల్డర్ ప్లాటుగా మార్చి విక్రయించే ప్రయత్నం చేస్తున్నారని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ సాకేత్ ప్రణామం అపార్ట్‌మెంట్ సొసైటీ కార్యదర్శి వల్లభేంద్ర రెడ్డి, డైరెక్టర్ శేషసాయి అన్నారు. బుధవారం బిల్డర్ తీరును నిరసిస్తూ అతడి కార్యాలయం వద్ద నిరసన చేశారు. వారు మాట్లాడుతూ... తమ అపార్ట్‌మెంట్‌కు ఏర్పాటుచేసిన రోడ్డును మూసి వేసే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. ప్లాట్ల విక్రయం పూర్తయిన వెంటనే బిల్డర్ రోడ్డు స్థలాన్ని సైతం అమ్మకానికి పెట్టాడని ఆరోపించారు. ఈ రోడ్డు హెచ్ఎండీఏ ప్లానింగ్ మ్యాప్‌లోనూ ఉందన్నారు. ఈ విషయంలో న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



నేడు మంచి రోజు..


సప్తమి కావడంతో అధిక నామినేషన్ల దాఖలుకు అవకాశం

తాండూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తొలి విడత సర్పంచ్ ఎన్నికలు డిసెంబరు 11వ తేదీనే ఉండటంతో గ్రామాల్లో నాయకులు, ఆశావహులు ఉరుకుల పరుగులు పెడుతున్నారు. సర్పంచ్, వార్డు మెంబర్ల అభ్యర్థులను ఖరారుకు ఎక్కువ సమయం లేక బుధవారం అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేపట్టారు. నామినేషన్ల స్వీకరణ ఈ నెల 27 నుంచి 29 వరకే ఉంది. ఈ 27వ తేదీ సప్తమి రోజు మంచిదని నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు ఆసక్తి చూపుతున్నారు. 28న అష్టమి, 29న నవమి ఉన్నందున హిందూ సిద్ధాంతాలు, తిథులు, నక్షత్రాలు, ఆచారాలు, గ్రహచారాన్ని నమ్మే వారు ఆ రోజుల్లో నామినేషన్లకు ఆసక్తి చూపరు. కాబట్టి మొదటి రోజే మంచి రోజని ఎక్కువ మంది నామాంకనాలు వేసే అవకాశం ఉంది. అయితే ఇలాంటి నమ్మకాలను పట్టించుకోని వారు మాత్రం మూడు రోజుల్లో ఎప్పుడైనా నామినేషన్ వేస్తారు.

ఇబ్బంది లేకుండా ఎన్నికలను నిర్వహించాలి


క్లస్టర్ అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో విశ్వప్రసాద్

తాండూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27 నుంచి ఆయా క్లస్టర్లలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిషత్‌లో మండలంలోని 33 పంచాయతీలను పది క్లస్టర్లుగా విభజించి సమీక్ష నిర్వహించారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. పోలింగ్ విధానం, కౌంటింగ్, విజేతల ప్రకటనపై ఎన్నికల అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. 27వ తేదీ నుంచి ఆయా పంచాయతీల క్లస్టర్లలో నామినేషన్లు స్వీకరించాలని తెలిపారు. గౌతాపూర్, జినుగుర్తి, సిరిగిరిపేట్, బెల్కటూర్, చెంగోల్, నారాయణపూర్, అంతారం, కోటబాస్పల్లి, మల్కాపూర్, కరన్‌కోట్ క్లస్టర్లలో వాటి పరిధి పంచాయతీల నామినేషన్లు స్వీకరించాలని తెలిపారు. ఎవరూ మండల కేంద్రానికి రావాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ అధికారులు వైజనాథ్, రాంనర్సింహారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సాయిప్రజీత్, రవీందర్‌గౌడ్, సాయన్న, ఎ.శివకుమార్, నందినిరెడ్డి, శ్రావణ్‌కుమార్, విజయభాస్కర్‌రెడ్డి, నాగభూషణం ఉన్నారు. ఎన్నికల్లో పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలని ఆదేశించారు.



క్లస్టర్ల వారీగా నామినేషన్ల స్వీకరణ

- నేటి నుంచి తొలివిడత నామినేషన్లు షురూ..
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు



చేవెళ్ల/శంషాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొత్తం 25 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం ఎనిమిది క్లస్టర్లు ఏర్పాటు చేశారు. ఆలూరు క్లస్టర్ పరిధిలో ఆలూరు, అంతారం, హస్తేపూర్, కౌకుంట్ల క్లస్టర్ పరిధిలో కౌకుంట్ల, తంగడ్‌పల్లి గ్రామాలు వస్తాయి. కమ్మెట క్లస్టర్ పరిధిలో కమ్మెట, ఈర్లపల్లి, ఎన్కెపల్లి, గొల్లగూడ గ్రామాలు వస్తాయి. న్యాలట క్లస్టర్ పరిధిలో న్యాలట, తల్లారం, సింగప్పగూడ గ్రామాలు వస్తాయి. చన్వల్లి క్లస్టర్ పరిధిలోకి చన్వల్లి, బస్తేపూర్, మీర్జాగూడ, ఖానాపూర్ క్లస్టర్ పరిధిలోకి ఖానాపూర్, నాన్‌చెర్వు, రేగడి ఘనాపూర్, దేవరంపల్లి గ్రామాలు వస్తాయి. గుండాల క్లస్టర్ పరిధిలోకి గుండాల, అల్లావాడ గ్రామాలు, ముడిమ్యాల్ క్లస్టర్ పరిధిలోకి ముడిమ్యాల్, రావులపల్లి, గొల్లపల్లి, కుమ్మెర గ్రామాల వారీగా ఉండనున్నాయి. ఆయా క్లస్టర్ పరిధిలో సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు ఆ క్లస్టర్‌లోనే నామినేషన్ సమర్పించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. నామినేషన్లు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారని పేర్కొన్నారు.


శంషాబాద్‌లో ఏడు క్లస్టర్లలో..

శంషాబాద్ మండలంలో గురువారం నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభమవుతోంది. మొత్తం 21 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు, 190 వార్డు సభ్యులకు నామినేషన్లు వేయడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మొత్తం ఏడు క్లస్టర్లలో నామినేషన్లు దాఖలు కానున్నాయి. పెద్దషాపూర్ క్లస్టర్‌లో పెద్దషాపూర్, పెద్దషాపూర్ తండా, అలీకోల్‌తండా, నర్కూడ క్లస్టర్‌లో నర్కూడ, చౌదరిగూడ, కవ్వగూడ, సుల్తాన్‌పల్లి క్లస్టర్‌లో సుల్తాన్‌పల్లి, ననాజీపూర్, కాచారం. రామాంజాపూర్ క్లస్టర్‌లో రామాంజాపూర్, బోటిగూడ, మల్కారం, పెద్దతూప్ర క్లస్టర్‌లో పెద్దతూప్ర, పెద్దతూప్ర తండా, ముచ్చింతల్, మదన్‌పల్లి క్లస్టర్‌లో మదన్‌పల్లి మదన్‌పల్లి కొత్త తండా, మదన్‌పల్లి పాత తండా, పాల్మాకుల క్లస్టర్‌లో పాల్మాకుల, జూకల్, పిల్లోనిగూడ వస్తాయి. ఆయా క్లస్టర్లలో సర్పంచ్ స్థానాలకు, వార్డులకు నామినేషన్లు దాఖలు చేయొచ్చని ఎంపీడీవో మున్ని పేర్కొన్నారు.

అత్తా.. కోడలా?

ఎస్టీ మహిళకు కోనాపూర్ సర్పంచ్ రిజర్వుడ్

- గ్రామంలో ఒక్కటే ఎరుకల కుటుంబం
- రెండోసారి ఆ కుటుంబంలోనే సర్పంచ్‌గా అవకాశం


కోనాపూర్ పంచాయతీ కార్యాలయం


సర్పంచ్‌గా అవకాశం లభించిన బెల్లకొండ కుటుంబం

ఆమనగల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ రెండోసారి ఆ కుటుంబానికి సర్పంచ్ రూపంలో కలిసొచ్చింది. గ్రామ పంచాయతీ మొత్తంగా రెండే గిరిజన మహిళా ఓటర్లు ఉండడంతో అత్తా.. కోడలా? సర్పంచ్ ఎవరనే చర్చ గ్రామంలో సాగుతోంది. రిజర్వేషన్ పరంగా గతంలోనూ ఆ కుటుంబానికి సర్పంచ్‌గా అవకాశం లభించింది. ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామంలో 1125 మంది ఓటర్లకు గాను.. 541 మంది పురుషులు, 584 మంది స్త్రీలు ఉన్నారు. పంచాయతీ రిజర్వేషన్లలో భాగంగా గ్రామ పంచాయతీని ఎస్టీ మహిళకు కేటాయించారు. గ్రామంలో ఉన్న ఒకే ఒక్క ఎరుకల కుటుంబానికి సర్పంచ్‌గా అవకాశం లభించింది. అందులో బెల్లకొండ రాములమ్మ, ఆమె కుమారుడు బెల్లంకొండ సైదులు, కోడలు బెల్లంకొండ శ్రీలత పేర్లు ఉన్నారు. 2013లో ఎస్టీ మహిళ రిజర్వేషన్ మూలంగా బెల్లంకొండ రాములమ్మ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం గ్రామంలో రెండే మహిళా ఓట్లు ఉండడంతో అత్తా కోడలు రాములమ్మ, శ్రీలత ఇద్దరిలో ఎవరో ఒకరు సర్పంచ్ కానున్నారు. గతంలో రాములమ్మ సర్పంచ్‌గా పని చేసినందున ఈ దఫా శ్రీలతకు అవకాశం కల్పించాలనే చర్చ సాగుతోంది. ఆ కుటుంబంలోని అత్త కోడళ్లలో ఎవరో ఒకరు తప్పుకుంటే మరొకరు ఏకగ్రీవమయ్యే అవకాశం ఉంది. అయితే, శ్రీలత సర్పంచ్‌గా ఏకగ్రీవంగా అయ్యే అవకాశం ఉంది.

కౌకుంట్లలో ఎస్సీలకు నో రిజర్వేషన్

చేవెళ్ల, నంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో మొత్తం 25 గ్రామ పంచాయతీలు ఉండగా 35,438 మంది ఓటర్లు ఉన్నారు. చేవెళ్ల డివిజన్ పరిధిలోని ఎన్నికలను రెండో విడత డిసెంబరు 11వ తేదీన నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైంది. అయితే మండలంలోని కౌకుంట్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం జనరల్ అభ్యర్థులకు కేటాయించారు. పది వార్డులు ఉండగా 5 జనరల్, 5 బీసీలకు కేటాయించారు. గ్రామంలో 2,060 ఓటర్లు ఉండగా ఇందులో ఎస్సీలకు ఒక్క వార్డు కూడా కేటాయించలేదు. ఈ విషయమై చేవెళ్ల మండల ఎంపీడీవో హిమబిందును వివరణ కోరగా 2011 జనాభా లెక్కల ప్రకారం కౌకుంట్లలో ఎస్సీ జనాభా తక్కువగా ఉంది. గతంలో ఉన్న ఎన్నికల నిబంధల ప్రకారమే రిజర్వేషన్లు చేశారని స్పష్టం చేశారు. ఎస్సీ రిజర్వేషన్ ఎందుకు చేయాలేదనే అంశంపై కోర్టులో కేసు కొనసాగుతుందని తెలిపారు.

నామినేషన్ వేస్తున్నారా?



రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో సర్పంచులు, వార్డుసభ్యుల పదవుల కోసం ఈనెల 27నుంచి 29 వరకు మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో నామినేషన్లు వేసే అభ్యర్థులు అవసరమైన పత్రాలు జత చేయాల్సినవి.

- నామినేషన్ పత్రం (ఫారమ్-2) నిర్ధేశించిన ఫారమ్‌ను నింపి, అభ్యర్థి సంతకంతో పాటు, ప్రతిపాదకుని సంతకాలతో దాఖలు చేయాలి.
- ధరవత్తు (డిపాజిట్) రుసుము నిర్ణీత మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాలో లేదా రిటర్నింగ్ అధికారికి చెల్లించి, దానికి సంబంధించిన రసీదును నామినేషన్ పత్రానికి జతచేయాలి.
- సర్పంచ్ అభ్యర్థికి రూ.1000, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ అభ్యర్థులకు 500రుపాయలు.
- అభ్యర్థి రిజర్వ్ చేయబడిన స్థానం నుంచి పోటీ చేస్తే ప్రభుత్వ నుంచి జారీ చేయబడిన కుల ధృవీకరణ పత్రం తప్పనిసరిగా జతచేయాలి.
- అభ్యర్థి తమ ఇంట్లో మరుగుదొడ్డి ఉందని, దాన్ని ఉపయోగిస్తున్నారని తెలిపే స్వీయ ధృవీకరణ పత్రం లేదా పంచాయతీ నుంచి పొందిన ధృవీకరణ పత్రం తప్పనిసరి.
- ప్రమాణ పత్రం లేదా డిక్లరేషన్. తాను ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హుడని తెలిపే డిక్లరేషన్.
- గ్రామ పంచాయతీకి పన్ను బకాయిలు లేవని నో డ్యూస్ సర్టిఫికెట్.
- క్రిమినల్ కేసులు ఏమైనా ఉన్నాయా.. అస్తుల వివరాలు వంటి ముఖ్య సమాచారాన్ని తెలిపే అఫిడవిట్.
- గుర్తింపు, నివాస ధృవీకరణ పత్రాలు, ఓటర్ జాబితాలో పేరు ఉన్నట్లయితే నిరూపించడానికి ఓటర్ ఐడీ లేదా ఇతర గుర్తింపు పత్రాలు తప్పనిసరి.
- నామినేషన్ పత్రాలను దాఖలు చేసేటప్పుడు అన్ని ఒరిజనల్ పత్రాలను ధృవీకరణ కోసం సిద్ధంగా ఉంచుకోవాలి.
- ధృవపత్రాల్లో మార్పులు, చేర్పులు ఉంటే పూర్తి సమాచారం కోసం స్థానిక, జిల్లా ఎన్నికల అధికారులను సంప్రదించాలి.

- కొత్తూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి)

సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే దాకా..

కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రాజకీయ ప్రస్థానం

- కడ్తాల మండలం చల్లంపల్లి సర్పంచ్‌గా రెండు సార్లు విజయం
- రెండు సార్లు జెడ్పీటీసీగా, మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపు
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం
- రాజకీయ ఎదుగుదలకు సర్పంచ్ పదవే పునాది గా నిలిచిందంటున్న జైపాల్ యాదవ్



ఆమనగల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా గడించిన పాలనానుభవం ఆయనకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చింది. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడానికి పునాదిగా నిలిచింది. గ్రామస్థాయి రాజకీయాల్లో ఆయన కుటుంబానికి ఆ సర్పంచ్ పదవే చెరగని ముద్ర వేసింది. జడ్పీటీసీగా, బీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా.. ఎమ్మెల్యేగా ఇలా అంచెలంచెలుగా రాజకీయంగా ఎదిగేందుకు సర్పంచ్ పదవే తొలిమెట్టుగా నిలిచింది. రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ సర్పంచ్ పదవులు అధిరోహించే వారికి ఆదర్శంగా, సర్పంచ్ పదవి ప్రాముఖ్యతను తెలిపేందుకు ఉదాహరణగా నిలిచారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల మండలం చల్లంపల్లికి చెందిన గుర్కా మంగమ్మ, బల్‌రామ్ దంపతులకు 1954 ఆగస్టు 25న జైపాల్ యాదవ్ జన్మించారు. డిగ్రీ పూర్తి చేసిన ఆయన 1970లో విద్యార్థి నాయకుడిగా రాజకీయ ప్రవేశం చేశారు. 1981లో తొలిసారిగా చల్లంపల్లి సర్పంచ్‌గా పోటీ చేసి సమీప ప్రత్యర్థి కృష్ణయ్యపై విజయం సాధించారు. సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేసి ప్రజల అభిమానం చూరగొన్నారు. 1988లో రెండోసారి మళ్లీ సర్పంచ్‌గా పోటీ చేసి మాధవరెడ్డిపై గెలుపొందారు. 1995లో తలకొండపల్లి, 2006లో వంగూరు జడ్పీటీసీ పదవికి పోటీ చేసి విజయం సాధించారు. 1997లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. 1999లో కల్వకుర్తి నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున తొలిసారిగా పోటీ చేసి విజయం సాధించారు. 2009లో మళ్లీ ఎమ్మెల్యేగా అదే పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2019లో మళ్లీ తన రాజకీయ చతురతతో బీఆర్ఎస్ టిక్కెట్ సాధించి మూడోసారి అనూహ్య విజయం సాధించారు. తన రాజకీయ ప్రస్థానం, పాలనానుభవం స్థానిక సంస్థల నుంచే మొదలైందని జైపాల్ యాదవ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మండల కార్యాలయానికి ఎన్నికల సామగ్రి



త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల స్టేషనరీ, ఇతర సామగ్రి తాండూరు మండల పరిషత్‌కు చేరింది. మండలంలో 33 పంచాయతీలకు సామగ్రిని సిద్ధం చేశారు. ఎన్నికల గైడ్స్‌లైన్స్, బ్యాలెట్ పేపర్లు, స్వాస్తిక్ ఎంబ్లం, వివిధ రకాల క్లాత్, బ్యాలెట్ బాక్స్‌లు, ఎన్నికల సిబ్బంది వినియోగించే ఇతర స్టేషనరీ ఐటంలు కార్యాయానికి తరలించారు. సామగ్రిని కార్యాలయ సిబ్బంది పరిశీలించారు. మొదటి విడత ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాలకు డిసెంబరు 10న సామాగ్రి తరలిస్తామని అధికారులు పేర్కొన్నారు.

- తాండూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి)


చిన్న నీటి వనరుల గణనపై శిక్షణ ఇస్తున్న తహసీల్దార్ సుచరిత

నీటి వనరులను పకడ్బందీగా లెక్కించాలి

శామీర్‌పేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటి వనరుల లెక్కింపులో నిర్లక్ష్యం లేకుండా పకడ్బందీగా గణన చేయాలని ఎన్యూమరేటర్లకు తహసీల్దార్ సుచరిత సూచించారు. బుధవారం మూడుచింతలపల్లి రెవెన్యూ కార్యాలయంలో ఏడో చిన్ననీటి వనరుల గణనపై ఆమె ఎన్యూమరేటర్లకు శిక్షణను ప్రారంభించారు. పేపర్ రహితంగా మొబైల్‌యాప్ ద్వారా నీటి వనరుల గణన చేయాలని వివరించారు. గ్రామ పాలన అధికారుల, వ్యవసాయ విస్తరణ అధికారుల, ఇతరుల సహాయంతో నవంబరు 27 నుంచి డిసెంబరు 20వరకు చిన్న నీటి వనరుల గణనను పూర్తి చేయాలని సూచించారు.

ఎన్ఎస్ఎస్‌లో చేరి సమాజ సేవ చేయాలి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో చేరి సామాజిక సేవ చేయాలని గురుకుల ఆర్మీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత అన్నారు. అంకుశాపూర్ ప్రిన్స్‌టన్ కాలేజీలో బుధవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం నిర్వహించారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలో పాల్గొనాలని సూచించారు. ప్రజలకు మద్యపాన నివారణ, పారిశుద్ధ్యం, సైబర్ క్రైం, డ్రగ్స్ గంజాయి, బాల్య వివాహాలు, తదితరాలపై అవగాహన కల్పించాలని తెలిపారు.

ఆలయ అభివృద్ధికి కృషి

కీసర, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):అందరి సహకారంతో కీసరగుట్ట ఆలయ అభివృద్ధికి కృషిచేస్తామని ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ అన్నారు. కీసరగుట్ట ఆలయంలో అవినీతి జరుగుతోందంటూ కొందరు ట్రస్ట్ బోర్డు సభ్యులు చేసిన ఆరోపణలను ఆయన బుధవారం ఖండించారు. స్వామివారి అభిషేకాల విషయంలో బోర్డు సభ్యులకు, దాతలకు, ప్రముఖులకు, వీఐపీలకు నిబంధనల ప్రకారమే గౌరవమిస్తున్నట్లు తెలిపారు. హుండీ లెక్కింపు సమయంలో సభ్యులకు, ఆలయ నిర్వాహకులకు జరిగిన అంతర్గత సంభాషణను కొందరు వక్రీకరించి అంతా అవినీతే జరుగుతోందని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

అహ్మదాబాద్ వెళ్లాల్సిన విమానం పది గంటలు ఆలస్యం

- ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల అందోళన

శంషాబాద్ రూరల్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అహ్మదాబాద్ వెళ్తున్న ఇండిగో ఎయిర్‌లైన్స్ పది గంటలు ఆలస్యమైంది. దీంతో ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు అందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరాల్సిన 6ఈ 883 ఇండిగో విమానం పైలెట్ రాకపోవడంతో ఎయిర్‌పోర్టులోని ప్రయాణికులు పడిగాపులు కాయల్సిన పరిస్థితి ఏర్పడింది. విమానంలో 191 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎయిర్‌లైన్స్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇబ్బందులు తప్పడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర పైలెట్‌ను రప్పించడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కొంత మంది ప్రయాణికులు తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకోగా, మరి కొంత మందికి హోటలలో బస ఏర్పటు చేసుకున్నారు. కొంత కాలంగా ఇండిగో ఎయిర్‌లైన్స్ సిబ్బంది, పైలెట్లు రాకపోవడంతో చాలా విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. కొన్ని విమానాలను రద్దు కూడా చేశారు.

బస్సు షెల్టర్ ఏర్పాటు అభినందనీయం

షాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బస్సు షెల్టర్ ఏర్పాటు అభినందనీయమని వాసవీ క్లబ్ ఇంటర్‌నేషనల్ అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్‌లో కీ.శే.బూర్గు వెంకటయ్య, మణెమ్మల జ్ఞాపకార్థం బూర్గు జగదీష్, వరలక్ష్మి నిర్మించిన బస్సు షెల్టర్‌ను ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా అవసరాలు తీర్చడంలో ఆర్యవైశ్యులు ఎప్పుడూ ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనంతం, లక్ష్మయ్య, వెంకటరమణ, మాణిక్యం, నవీన్‌కుమార్, సురేష్, రాంమోహన్‌గుప్తా, జగదీశ్వర్, పాండురంగం, రమేష్, రఘు, సతీష్, శ్రీనివాస్, వాసు, రాము, సుమన్, నర్సింహులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై స్పెషల్ ఫోకస్



తాండూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పాత తాండూరు ప్రాంతంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ యాదగిరి పారిశుధ్య పనులపై పరిశీలించారు. ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకొని పనులపై ఆరా తీశారు. బసవన్న కట్ట వద్ద కూరగాయ వ్యాపారులు రోడ్డు పక్కన వ్యర్థాలను వేయకుండా సూచనలు చేశారు. ఆయనతో ఏఈ ఉదయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వెంకటయ్య, ఉమేశ్‌కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి వంశీ, ఎనిర్వాల్‌మెంట్ ఇంజనీర్ ప్రవీణ్‌గౌడ్, జవాన్లు ఉన్నారు.

మా భూములు తీసుకోవద్దు

షాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేగడిదోస్వాడలోని సర్వే నంబర్ 102లోని ప్రభుత్వ భూమిని రేగడిదోస్వాడ, మక్తగూడ, వెంకమ్మగూడ, తాళ్లపల్లి రైతులకు గత ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో లో 1954-55లో పంపిణీ చేసింది. వాటిని ఇప్పుడు తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయా గ్రామాల రైతులు బుధవారం షాబాద్ తహసీల్దార్ అన్వర్‌ను కలిసి వినతిప్రతం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఏళ్లుగా సాగు చేసుకొని బతుకుతున్నామని, ఇప్పుడు భూములను తీసుకుంటే ఎలా బతికేదని వాపోయారు.

జీవోను ఉపసంహరించుకోవాలి

- తహసీల్దార్ ఆజంఅలీకి వినతి

కొందుర్గు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఫీల్డ్ కోడ్‌లో భాగంగా విడుదల చేసిన జీవోతో తమ కుటుంబాలు రోడ్డున పడుతాయని కొందుర్గు మండల పరిధిలోని ముట్పూర్, చుక్కమెట్టు, ఉమ్మెంత్యాల, లాలాపేట గ్రామాల రైతులు వాపోయారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ ఆజంఅలీకి వినతిపత్రం అందజేశారు. భూములు నమ్ముకొని జీవిస్తున్నామని, ఇప్పుడు ఆ భూములే పోతే ఎలా బతకాలని అందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే ఇచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బుయ్యని మహేందర్, నర్సింలు, నర్సింహారెడ్డి, అంజయ్య, నర్సింలు, శేఖర్, రాములు, యాదయ్య ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌నాయక్

'సర్వీస్' టీచర్లను టెట్ నుంచి మినహాయించాలి

కొత్తూర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో చట్ట సవరణ ద్వారా సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ కోరారు. ఈమేరకు కొత్తూర్‌లో ఆ యూనియన్ మండల నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గోపాల్‌నాయక్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేసి పీఆర్సీ రిపోర్టు ఇవ్వాలని, ప్రమోషన్ల ద్వారా ఏర్పడ్డ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడిగా గౌరయ్య, ప్రధాన కార్యదర్శిగా ప్రిన్స్, సభ్యులుగా శ్రీనివాస్‌రావ్, సాయన్న, అరవింద్, భాస్కర్‌రావులను ఎన్నుకున్నారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు రఘుపాల్, సాదత్‌అలీ, బాలకృష్ణ, శ్రీనివాస్‌రావ్, సవిత, సాయన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

పరిగి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జీసీడీవో శ్రీదేవి సూచించారు. బుధవారం జాఫర్‌పల్లిలోని ఆదర్శ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో గోపాల్, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, వార్డెన్ పద్మ పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జీసీడీవో శ్రీదేవి

పంచాయతీ పోరు

నామినేషన్లకు ఏడు క్లస్టర్ల ఏర్పాటు

బషీరాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా 39 పంచాయతీలకు ఎన్నికల నామినేషన్ల దాఖలుకు ఏడు క్లస్టర్లను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సంపత్‌కుమార్ తెలిపారు. గురువారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. బషీరాబాద్, జీవన్గి, కాశీంపూర్, గొట్టిగఖుర్దు, ఎక్మాయి, మైల్వార్, నీళ్లపల్లిల్లో క్లస్టర్లను ఏర్పాటు చేసి వాటి పరిధి గ్రామాల పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే వారి నుంచి నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఆయా క్లస్టర్లలోనే నామినేషన్ వేయాల్సి ఉంటుందని చెప్పారు. ఏడుగురు స్టేజ్-1, స్టేజ్-2 అధికారులను నియమించామని తెలిపారు.

నేటి నుంచి నామినేషన్లు

దౌల్తాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గురువారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని ఎంపీడీవో శ్రీనివాస్ బుధవారం పేర్కొన్నారు. మండలంలో 33 పంచాయతీలు, 290 వార్డులు ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల కోసం 290పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామని, 8 మంది స్టేజ్-1 ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు.

ఎన్నికల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి


డీఎస్పీకి మొక్కను అందజేస్తున్న ఎస్ఐ నుమాన్‌అలీ

బషీరాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున్న శాంతి భద్రతల పట్ల అప్రమత్తంగా ఉండాలని తాండూరు డీఎస్పీ నర్సింగ్ యాదయ్య సూచించారు. మంగళవారం రూరల్ సీఐ ప్రవీణ్‌రెడ్డితో కలిసి బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. అనంతరం ఎస్ఐ నుమాన్‌అలీ, సిబ్బందితో సమావేశమై పలు అంశలపై చర్చించారు. సరిహద్దు మండలం కావడంతో విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండోద్దని, నిఘా పెంచాలని పోలీస్ అధికార, సిబ్బందికి ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ లోక్యా నాయక్, నర్సమ్మ, పీసీలు నగేంద్ర, రమేష్ ఉన్నారు.

వార్డు స్థానాలను బీసీలకు కేటాయించరా?


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న టేకుల్‌కోడ్ వాసులు

కొడంగల్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్లు పంచాయతీల వారీగా మంగళవారం ప్రకటించారు. టేకుల్‌కోడ్, పాటిమీదిపల్లి గ్రామాల్లో వార్డు మెంబర్ల రిజర్వేషన్లలో బీసీలకు కేటాయింపు లేకపోవడంతో ఆయా గ్రామాల వాసులు బుధవారం కార్యాలయానికి చేరుకుని ఎంపీడీవో ఉషశ్రీకి వినతిపత్రం ఇచ్చారు. టేకుల్‌కోడ్ మాజీ సర్పంచ్‌లు గుండప్ప, లక్ష్మణ్‌నాయక్, శాంతారాం, గ్రామస్తుడు బస్వరాజ్, మాట్లాడుతూ.. తమ పంచాయతీలో పది వార్డులు ఉండగా అందులో ఎస్టీ-2, ఎస్సీ-3, అన్‌రిజర్వ్‌కు 5 స్థానాలకు కేటాయించారని, గ్రామంలో మెజార్టీ సంఖ్యలో బీసీలు ఉన్నా ఒక్క వార్డునైనా రిజర్వు చేయలేదని అన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా రఘపతిరెడ్డి, లక్ష్మకాంత్ రెడ్డి, తుల్జప్ప, వెంకటయ్య, నర్సప్ప పాల్గొన్నారు.

తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రం


కొండాయపల్లిలో తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రం

దోమ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దోమ మండలంలోని కొండాయపల్లిలో అంగన్‌వాడీ భవనం తెరుచుకోలేదు. దిర్సంపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని 20రోజులుగా ఆయానే కొనసాగిస్తోందని గ్రామస్తులు తెలిపారు. సూపర్‌వైజర్లు అంగన్‌వాడీల దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. సంబంధిత అధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కులకచర్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో హబీబ్ అహ్మద్ అన్నారు. బుధవారం చాపలగూడెం పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించి, విద్యార్థుల అభ్యసన స్థాయి గురించి టీచర్లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

● రాజ్యాంగ కర్త డాక్టర్ అంబేద్కర్‌కు నివాళులు అర్పించిన పలువురు


బొంరాస్‌పేట్: అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టీచర్లు


కులకచర్లలో దళిత సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం

బొంరాస్‌పేట్/కులకచర్ల/తాండూరు/మోమిన్‌పేట్/ఘట్‌కేసర్ రూరల్/ఘట్‌కేసర్/వికారాబాద్/శామీర్‌పేట,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం మండల కేంద్రాలు, పాఠశాలలు, రాజకీయ పార్టీల కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. బొంరాస్‌పేట్ జెడ్పీ పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. హెచ్‌ఎం కాశయ్య, టీచర్ రమేశ్ మాట్లాడుతూ.. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలో పరిపాలనకు రాజ్యాంగ పరిషత్తును ఏర్పాటు చేశారన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాగం అన్నారు. రాజ్యాంగ వైశిష్ట్యాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో టీచర్లు బాకారం మల్లయ్య, శివరాజ్ పాల్గొన్నారు. కులకచర్ల చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మొగులయ్య, భరత్ కుమార్, నర్సిములు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్, నాయకులు వెంకటయ్యగౌడ్, వెంకట్రాములు, కృష్ణయ్యగౌడ్, పవన్‌కుమార్, తుప్పలి వెంకటేశం పాల్గొన్నారు. తాండూరులో బీఎస్పీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రాజ్యాంగ చిత్రపటాలకు పూల మాలలు వేసి రాజ్యాంగాన్ని సంరక్షించాలని నినాదాలు చేశారు. మోమిన్‌పేట్ మండలం మేకవనంపల్లి జెడ్పీ పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్‌పై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం గౌరీశంకర్, టీచర్లు పాల్గొన్నారు. ప్రతాప్‌సింగారం జెడ్పీ, పోచారం మున్సిపల్ పాఠశాలల్లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. స్ఫూర్తి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వ్యాస రచన, ఎస్‌ఏ రైటింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవికుమార్, ఆర్గనైజేషన్ నిర్వాహకుడు యాదగిరి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని ఘట్‌కేసర్ జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం పాపిరెడ్డి అన్నారు. రాజ్యాంగ హక్కులు, విధులపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. పౌరులందరికి గౌరవాన్ని పెంచింది రాజ్యాంగమేనని దళిత సంఘాల నాయకులు అన్నారు. బుధవారం వికారాబాద్‌లోని ఎన్నెపల్లి చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం నివాళులు అర్పించారు. టి.రాంచందర్, ఆనంద్, డీఎస్పీ జిల్లా కన్వీనర్ రవీందర్, కేపీపీఎస్ మహిపాల్, బి.నర్సిములు, రవీందర్, సతీష్, రత్నం, చంద్రయ్య, శేఖర్ పాల్గొన్నారు. ప్రజలకు హక్కులను కల్పించిన మహానుభావుడు అంబేద్కర్ అని శామీర్‌పేట గురుకుల డిగ్రీ మహిళా కళాశాల కామర్స్ అధ్యాపకురాలు రాజ్యలక్ష్మి అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కళాశాల గ్రౌండ్‌లో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. లెక్చరర్ స్వాతి, కల్చరల్ కోఆర్డినేటర్ ధనవేణి పాల్గొన్నారు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో రాజ్యంగ దినోత్సవాన్ని నిర్వహించారు. తూంకుంటలోని చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి డీసీసీ అధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలుయాదవ్, మేడ్చల్ ఎ-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, తుంకి రమేశ్, వెంకటేశ్, భిక్షపతి అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. శామీర్‌పేటలో మండల దళిత సేన అధ్యక్షుడు మురళి, నాయకులు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.


ఘట్‌కేసర్ జెడ్పీ హైస్కూల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


ఘట్‌కేసర్ రూరల్: ప్రతాప్‌సింగారం పాఠశాలలో వ్యాసరచన పోటీలు



శామీర్‌పేట: తూంకుంటలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వజ్రేశ్‌యాదవ్, జైపాల్‌రెడ్డి, నర్సింలు, వేణుగోపాల్‌రెడ్డి


వికారాబాద్: అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు


మోమిన్‌పేట్: మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న పాఠశాల విద్యార్థులు


తాండూరు బీఎస్పీ కార్యాలయంలో రాజ్యాంగానికి పూల మాలలు వేసిన బీఎస్పీ నాయకులు

నారీ.. సారీ!

(ఐదోపేజీ తరువాయి)

మాత్రం 48.16 శాతం మాత్రమే రిజర్వు చేశారు. మహిళలకు ప్రత్యేకంగా రిజర్వు చేసిన సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు మహిళలే పోటీ చేయనుండగా, అన్ రిజర్వుడ్(జనరల్) స్థానాల్లో మహిళలు పోటీ చేయడానికి అవకాశం ఉన్నా.. పురుషుల మధ్యనే పోటీ నెలకొననున్న నేపథ్యంలో మహిళలు పంచాయతీ ఎన్నికల్లో ఏ మేరకు పోటీ చేసి తమ సత్తా చాటుకుంటారనేది తెలియాలంటే వేచిచూడాల్సిందే.

మండలాల వారీగా సర్పంచ్ స్థానాలు ఇలా..

బంట్వారం మండలంలో 12 పంచాయతీలు ఉండగా, వాటిలో 6 పంచాయతీలను మహిళలకు కేటాయించారు. బషీరాబాద్ మండలంలో 39 పంచాయతీలు ఉండగా, 18 స్థానాలను మహిళలకు రిజర్వు చేశారు. బొంరాస్‌పేట్ మండలంలో 35 పంచాయతీలు ఉండగా, వాటిలో 17 స్థానాలు, చౌడాపూర్ మండలంలో 24 పంచాయతీలు ఉండగా, 10 సర్పంచ్ స్థానాలు మాత్రమే మహిళలకు రిజర్వు అయ్యాయి. ధారూరు మండలంలో 34 పంచాయతీలు ఉండగా, 17 స్థానాలు, దోమ మండలంలో 36 పంచాయతీలు ఉండగా, 17స్థానాలు, దౌల్తాబాద్ మండలంలో 33 పంచాయతీలు ఉండగా, 16 స్థానాలు మహిళలకు కేటాయించారు. దుద్యాల్ మండలంలో 20 పంచాయతీల్లో 9 స్థానాలు, కొడంగల్ మండలంలో 25 పంచాయతీలు ఉండగా, 11 స్థానాలు.. కోట్‌పల్లి మండలంలో 18 పంచాయతీల్లో 8 స్థానాలు.. కులకచర్ల మండలంలో 33 పంచాయతీల్లో 15 స్థానాలు.. మర్పల్లి మండలంలో 29 పంచాయతీల్లో 14స్థానాలు.. మోమిన్‌పేట్ మండలంలో 29 పంచాయతీల్లో 14 స్థానాలు.. నవాబ్‌పేట్ మండలంలో 32 పంచాయతీల్లో 15 సర్పంచ్ పదవులు.. మహిళలకు రిజర్వు చేశారు. పరిగి మండలంలో 32 పంచాయతీల్లో 15స్థానాలు.. పెద్దేముల్ మండలంలో 38 పంచాయతీల్లో 19 స్థానాలు.. పూడూరు మండలంలో 32 పంచాయతీల్లో 15స్థానాలు.. తాండూరు మండలంలో 33 పంచాయతీల్లో 16 స్థానాలు.. వికారాబాద్ మండలంలో 21 పంచాయతీల్లో 9స్థానాలు.. యాలాల్ మండలంలో 39 పంచాయతీలు ఉండగా, వాటిలో 18స్థానాలు మహిళలకు రిజర్వు చేశారు.

సం'గ్రామం' షురూ..

(ఐదోపేజీ తరువాయి)

ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల జాబితా రూపొందించి గుర్తులతో పాటు రిటర్నింగ్ అధికారులు ప్రకటిస్తారు. 11వ తేదీ, గురువారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తొలి విడత ఎన్నికల పోలింగ్ జరగనుంది. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ఓట్ల లెక్కింపు పూర్తి కాగానే వెంట వెంటనే ఫలితాలు ప్రకటించనున్నారు. అంతేకాకుండా అదే రోజు ఉప సర్పంచ్ ఎన్నికలు కూడా నిర్వహించనున్నారు. తొలి విడతలో జిల్లాలో తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలోని 8 మండలాల పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. తాండూరు, పెద్దేముల్, యాలాల్, బషీరాబాద్, కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, దుద్యాల మండలాల్లోని 262 పంచాయతీలల్లోని సర్పంచ్ పదవులకు, 2198 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. తాండూరు మండలంలో 33 పంచాయతీల్లో సర్పంచ్, 290 వార్డు సభ్యుల పదవులకు, బషీరాబాద్‌లో 39 పంచాయతీలు, 312 వార్డులు, యాలాల్‌లో 39 పంచాయతీలు, 318 వార్డులు, పెద్దేముల్‌లో 38 పంచాయతీలు, 308 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. కొడంగల్‌లో 25 పంచాయతీల్లో సర్పంచ్, 222 వార్డు సభ్యుల పదవులకు, దౌల్తాబాద్‌లో 33 పంచాయతీలు, 290 వార్డులు, బొంరాస్‌పేట్ మండలంలో 35 పంచాయతీలు, 292 వార్డులు, దుద్యాల్ మండలంలో 20 పంచాయతీలు, 166 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.

తొలి విడత పంచాయతీ ఎన్నికల వివరాలు

రెవెన్యూ డివిజన్	తాండూరు
మండలాలు	తాండూరు, బషీరాబాద్, యాలాల్, పెద్దేముల్, కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, దుద్యాల్
పంచాయతీలు	262
వార్డులు	2,198
పోలింగ్ కేంద్రాలు	2,198
ఓటర్లు	2,93,552

తొలి విడతలో 2,93,552 మంది ఓటర్లు

తొలి విడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో మొత్తం 2,93,552 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు. వీరిలో 1,42,307 మంది పురుషులు, 1,51,237మంది మహిళలు, 8 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. కొడంగల్ మండలంలోని 32,205 మంది ఓటర్లలో 15,782 మంది పురుషులు, 16,423 మంది మహిళలు ఉన్నారు. బషీరాబాద్ మండలంలో 40,987 మందిలో 19,472 మంది పురుషులు, 21,515 మంది మహిళలు ఉన్నారు. బొంరాస్‌పేట్ మండలంలో 32,121 మంది ఓటర్లు ఉండగా, 15,896 మంది పురుషులు, 16,225 మంది మహిళలు ఉన్నారు. దౌల్తాబాద్ మండలంలో 40,977 మంది ఓటర్లు ఉండగా, వారిలో 20,019 మంది పురుషులు, 20,953 మంది మహిళలు, ఇతర ఓటర్లు ఐదు గురు ఉన్నారు. దుద్యాల్ మండలంలో 21,078 మంది ఓటర్లు ఉండగా, వారిలో 10,248 మంది పురుషులు, 10,830 మంది మహిళలు ఉన్నారు. పెద్దేముల్ మండలంలో 40,828 మంది ఓటర్లు ఉండగా, వారిలో 19,804 మంది పురుషులు, 21,024 మంది మహిళలు ఉన్నారు. తాండూరు మండలంలోని 46,646 మంది ఓటర్లలో 22,686 మంది పురుష లు, 23,958 మంది మహిళలు, ఇద్దరు ఇతర ఓటర్లు ఉన్నారు. యాలాల్ మండలంలో 38,710 మంది ఓటర్లుండగా, 18,400 మంది పురుష లు, 20,309 మంది మహిళలు, ఒక ఇతర ఓటరు ఉన్నారు.

పేదలకు సొంతిల్లు కట్టివ్వడమే ప్రభుత్వ ధ్యేయం


పొన్నాల్‌లో ఇందిరమ్మ ఇంటికి ప్రారంభోత్సవం చేస్తున్న మూడుచింతలపల్లి మున్సిపల్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేశ్

శామీర్‌పేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పేద ప్రజలకు సొంతింటిని కట్టివ్వడమే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ లక్ష్యం అని మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేశ్ అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి పరిధి పొన్నాల్‌కు మాజీ ఉపసర్పంచ్ గడ్డం రమేశ్ ఆధ్వర్యంలో వెంకటేశ్ వచ్చి జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డితో కలసి లబ్ధిదారులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి రూ.5లక్షలు ఇస్తున్న ఘనత రాష్ట్ర చరిత్రలో కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ ఎ-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేశ్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు యాదగిరి, నర్సింగరావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల కేటాయింపులో అవకతవకలు

బొంరాస్‌పేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో బొంరాస్‌పేట్ మండల ఉపాధ్యాయులకు విధుల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గౌరారం గోపాల్ ఆరోపించారు. బుధవారం ఎంపీడీవో వెంకన్నగౌడ్‌కు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధుల కేటాయింపులో అనుభవం కలిగిన సీనియర్‌లను పక్కకు పెట్టి, కొత్తగా విధుల్లో చేరిన టీచర్లకు డ్యూటీ కేటాయించడం సరైంది కాదన్నారు. ఒకే పాఠశాల నుంచి 11 మంది ఉపాధ్యాయులను ఒకే విడత ఎన్నికల్లో విధుల్లో తీసుకున్నారన్నారని, దీంతో చదువులపై ప్రభావం పడుతుందన్నారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్ ఢీకొని యువకుడి దుర్మరణం


యాదగిరి(ఫైల్)

తాండూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా ట్రాక్టర్ ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన సంఘటన కరన్‌కోట్ పీఎస్ పరిధి కోటబాస్పల్లిలో బుధవారం జరిగింది. మృతుడి కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటబాస్పల్లికి చెందిన వడ్డె రాజు-గంగమ్మ దంపతుల మూడో కుమారుడు యాదగిరి(17) నాపరాతి గనుల్లో పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం యాదగిరి ఆంజనేయస్వామి ఆలయం వద్ద రోడ్డు దాటుతుండగా కోటబాస్పల్లి నుంచి తాండూరుకు గోడరాయి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో యాదగిరికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన మాజీ వైస్‌ఎంపీపీ స్వరూప భర్త వెంకట్‌రాంరెడ్డి ఆస్పత్రికి చేరుకొని యాదగిరి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

ధారూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులను భరించలేక పుట్టింట్లో ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గడ్డమీది గంగారంలో జరిగింది. ఎస్సై రాఘవేందర్ తెలిపిన ప్రకారం.. గడ్డమీది గంగారానికి చెందిన గంజి శిరీష(21)తో పరిగి సమీపం మల్లెపోనిగూడకు చెందిన శివలింగంతో ఐదు నెలల క్రితం వివాహమైంది. భార్యాభర్తలు తరుచూ గొడవపడేవారు. పుట్టింటికి వచ్చినప్పుడల్లా శిరీషకు నచ్చచెప్పి భర్త ఇంటికి పంపేవారు. ఈ నెల 24న శివలింగం.. శిరీషను పుట్టింట్లో దింపి వెళ్లిపోయాడు. మనస్థాపంతో ఉన్న శిరీష తన తల్లి మల్లమ్మ ఎంత అడిగినా ఏమీ చెప్పలేదు. శిరీష మంగళవారం సాయంత్రం ఉరేసుకుంది. సాయంత్రం కూలి పనినుంచి ఇంటికొచ్చిన తల్లి మల్లమ్మ కూతురు మృతితో బోరున విలపించింది. కాగా శిరీష అదేరోజు భర్తతో ఫోన్లో మాట్లాడగా .. 'నువ్వు చావు' అని భర్త శివలింగం పదే పదే దూషించాడు. వీరిద్దరి ఫోన్ సంభాషణ రికార్డును మల్లమ్మ పోలీసులకు అందజేసింది. ఈ మేరకు శివలింగంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించాడు.

దాడి ఘటనలో ఐదుగురిపై కేసు

కులకచర్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పెళ్లిలో గొడవపడి ఒకరిపై ఒకరు దాడికి పాల్పడిన ఘటనలో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని పుట్టపహాడ్‌లో బుధవారం పెళ్లి కుమారుడి ఇంట్లో పెళ్లి జరిగింది. పెళ్లికి గండీడ్ మండలం చిన్నవార్వాల్‌కు చెందిన వారు అమ్మాయి తరఫున వచ్చారు. వార్వాల్‌కు చెందిన కొండమోని వెంకటయ్య, గొడుగు కృష్ణయ్య గొడవపడ్డారు. కృష్ణయ్య.. వెంకటయ్య కుమారుడు మల్లేశ్‌కు ఫోన్‌చేసి..' మీ నాన్న మాతో పెళ్లిలో గొడవపడ్డాడు. మాట్లాడుకుందాం రా' అని పిలిపించాడు. మల్లేశ్ పుట్టపహాడ్‌కు వస్తుండగా గ్రామ శివారులో కృష్ణయ్య, చిన్నవార్వాల్‌కు చెందిన శ్రీకాంత్, అంజి, కృష్ణ, బావ ఆంజనేయులు దాడికి పాల్పడ్డాడు. దీంతో మల్లేశ్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు ఐదుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై రమేశ్‌కుమార్ తెలిపారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

బషీరాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను టాస్క్‌ఫోర్సు పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఇందర్‌చెడ్ శివారు కాగ్నా నదిలోంచి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను టాస్క్‌ఫోర్స్ పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నుమాన్‌అలీ చెప్పారు.

పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

మర్పల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు సురేశ్ అన్నారు. బుధవారం రావులపల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికేదైనా కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో దివాకర్, సురేశ్, అబ్రహం, రమేశ్, రవి, వినోద్, రామకృష్ణారెడ్డి, బాల్‌రాజ్, రమేశ్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు


మాట్లాడుతున్న తహసీల్దార్ తారాసింగ్

తాండూర్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కోసం ఒక్కో ట్రాక్టర్‌కు రూ.900 డీడీ చెల్లించాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని తహసీల్దార్ తారాసింగ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఉచితంగా సరఫరా చేస్తామన్నారు. లబ్ధిదారులు పంచాయతీ కార్యదర్శి, హౌసింగ్ ఏఈ అనుమతితో తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత తాండూర్ వాగు నుంచి ఇసుక తరలింపు అనుమతులు నిలిపేశామన్నారు.

సంక్షిప్తంగా..

రజకులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి



మేడ్చల్ టౌన్: రజకులకు ఉచిత కరెంట్ పథ కాన్ని అందజేయాలని మేడ్చల్ జిల్లా రజక సంఘం నాయకులు బుధవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. గత ప్రభుత్వ రజకుల కోసం ప్రవేశపెట్టిన ఉచిత కరెంట్ పథకాన్ని ఇప్పటి ప్రభుత్వం అమలు చేయటంలేదని తెలిపారు. దీనికి తోడు రజకుల సంబంధించిన బిల్లులను పెండింగ్‌లో చూపించి వాటిని చెల్లించాలంటూ అధికారులు వత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పంజగారి ఆంజనేయులు, పెద్ద లాల్‌రాములు, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం

బొంరాస్‌పేట్: మండలంలోని ఏర్పుమళ్ల పాఠశాలలో బుధవారం స్వయం పాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. ప్రధానోపాధ్యాయురాలిగా విజయలక్ష్మి, ఎంఈవోగా వెంకటేశ్, డీఈవోగా గణేశ్, పలువురు విద్యార్థులు టీచర్లుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందించారు. హెచ్‌ఎం రవీందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, ఎస్‌ఎంసీ వసంత, వెంకట్రాములుగౌడ్, అంజిల్‌రెడ్డి పాల్గొన్నారు.



పరిసరాల పరిశుభ్రతకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి



కీసర: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. శ్రీలక్ష్మీనగర్ కాలనీలో 15 రోజులుగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి గురువారం కాలనీ ఆర్చ్ ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. కమిషనర్ విచ్చేసి మాట్లాడారు. కాలనీలోని రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ వేశామని తెలిపారు. అందరి సహకారంతో కాలనీ నూతన కాలనీగా తీర్చిదిద్దామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన సాకేత్‌నగర్

వికారాబాద్: పట్టణంలోని సాకేత్‌నగర్ కాలనీ బుధవారం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. గౌరీశంకర్ వరసగా 18వ సారి మాలధారణ చేయడంతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 18మెట్లపై జ్యోతులు వెలిగించారు. ముఖ్య అతిథి చేవేళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అయ్యప్ప పూజలో పాల్గొని గౌరీశంకర్‌ను సన్మానించారు. పూజా కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

